


వస్త్ర విన్యాసం!

దేశానికి గాంధీ గారు ఏం చేసేరో చరిత్ర పాఠాలు, బతికున్న తాతయ్యలూ చెబుతూనే వున్నారు. ప్రత్యేకించి నేను కూడా చెప్పనవసరంలేదు. అయితే గాంధీజీ బతికిన తీరు మాత్రం నన్ను బాగా ఆకర్షించింది. మహాత్ముడు గనుక అతనిరాడంబరంగా ఎంతో సింపులుగా తన జీవన విధానాన్ని మలుచుకో గలిగేడు. దేశంలో ఆయనకున్న పరపతికి ఇంకోడూ, మరొకడూ అయితే బంగారు సింహాసన మెక్కి, రత్న కిరీటం పెట్టుకుని ధగధగా మెరిసిపోయేవాడు. చూస్కో నా తడాఖా అంటూ చక్రం తిప్పేసేవాడు. ఇంపోర్టెడ్ కారుని సుబ్బరంగా ఏ. సి. చేయించుకుని రోజుకో ఊరు విజిట్ చేసేవాడు. సొంతానికి హెలికాప్టర్లూ ఎయిర్ పోర్టులూ కొనుక్కునే

వాడు. స్కాచ్ మాత్రమే పుచ్చుకునేవాడు. ఖరీదైన లంచ్ డిన్నర్‌లో పళ్ళు పెంచుకునేవాడు.

గాంధీ గనుక గావంచా కట్టుకున్నాడు. చొక్కా లేకుండా కాలి నడకతో తిరిగేడు. వేరుశనగపప్పు, మేకపాలు పుచ్చుకొని ఈ పొట్టకిది చాలన్నాడు. ఆశ్రమ వాతావరణంలో రాట్నం తిప్పుతూ గంగిగోవులా బతికేడు. సుఖాలా, సౌఖ్యాలూ కాల్తో కొట్టేసి దేశమే నా ప్రాణమని ఇంత పెద్దదేశానికి అంకితమయిపోయాడు. ఇల్లాంటి వాళ్ళు కోటానుకోట్లలో ఎవ్వరో ఒక్కరుంటారు. వాటికోదణ్ణం. వదిలేయండి. ఈ రోజులెట్లావున్నాయని.... మనిషికంటె అతని దర్జాకి విలువయిచ్చే దగుల్బాజీ తనం బాగా అలవాటై పోయింది. కేటుగాడు సూటులోవుంటే వంగివంగి దణ్ణం పెడతాం. సాక్షాత్తు దేవుడే చింకిబట్టల్తో దర్శనమిస్తే ఛీ పొమ్మంటాం.

నువ్వు తొడుక్కున్నకోటు నీ సొంతమేనా అని ఎవరూ అడగరు. కోటుకింద చిరుగుల చొక్కా వున్నా అది సర్దుకుపోతుంది. కోటు ముఖ్యం కోటు తొడుక్కుంటే అదొక హోదా. అదొక స్టేటస్. నువ్వు నడుస్తుంటే నీకు దారిస్తారు. సోడా తాగి చిల్లర లేదంటే పర్లేదు వెళ్ళి రండంటారు. ఫంక్షనులో ముందు సీట్లో కూచో బెడతారు. వేదిక మీద వక్త నిన్ను చూస్తూ మాట్లాడుతాడు. నువ్వు విసుక్కున్నట్లు నటిస్తే వక్త తికమక పడి పోతాడు. ఇదంతా నిన్ను చూసి ఇస్తున్న మర్యాద కాదు. నీ కోటు మహాత్మ్యమని తెలుసు కోవాలి. అదే నువ్వు మురికి బట్టల్తో నడుస్తే జనం నిన్ను పురుగు చూసినట్లు చూస్తారు. నువ్వు గవర్నరువే కావచ్చు. నీ హోదాని నీ బట్టలు పాడు చేస్తున్నాయని తెలుసుకోవాలి. మురికి బట్టలు కట్టుకున్న నేను గవర్నరని అట్ట ముక్క తగిలించుకోరు. ఎవడో పిచ్చి వెధవ క్లయిమాక్సు కొచ్చేడని మెంటల్ హాస్పిటల్‌లో చేర్చి పుణ్యం కట్టుకుంటారు.

అంతవరకూ ఎందుకు? మాసిన బట్టలు తొడుక్కున్నప్పుడు మనకే మనసు చిన్న బోతుంది. రాజ్యం పోగొట్టుకున్న రాజాధి రాజు వీధులు

తిరుగుతూ బిచ్చమెత్తుకుంటున్న ఫీలింగు కలుగుతుంది. తెలిసినవాళ్ళు కనిపిస్తే మనమే తప్పుకు తిరుగుతాం. ఇంట్లో ఎంత ఐశ్వర్యమున్నా వంటిమీద కెక్కిన మురికిబట్టలు మనసుని ఖరాబు చేస్తాయి. బతుకు తగలడి పోయినంత బాధ కలుగుతుంది. ఎవరు పలకరించినా సిగ్గు చిచ్చు బుడ్డిలా విరుచుకు పడుతుంది. ఇస్త్రీ బట్టలు వేసుకున్నప్పుడు మాత్రం మానసిక పరిస్థితి దీనికి పూర్తి విరుద్ధంగా వుంటుంది. సొంత దరిద్రాన్ని కేర్ చేయం. పిచ్చి తెగింపుకి మనసుని ఆవరించగా పెద్ద పెద్ద అంగలతో హోదా నడకతో వెలిగిపోతుంటాం. బట్టల్ని బట్టి నడిచే విధానం కూడా మారుతుందని మనం గ్రహించాలి. కావలిస్తే ప్రయోగం కూడా చేయండి. తప్పైతే నన్ను శపించండి.

ఎందరో స్వాముల్ని చూసేను. ఎవరు చెప్పినా పెద్ద బాలశిక్ష నీతులే. అసత్యమాడ రాదు. అన్యాయం చేయరాదు. పక్కవాణ్ణి ఆదరించుము. నీతిగా బతికి భళీ అనుపించుకొనుమనే సుద్దులు, స్వాములు చెబితేనే తలలూపుతాం. ఆపాటి నీతులు మనకి తెలీక కాదు. కొన్ని ఏళ్ళతరబడి చదువుకుంటున్నాం. వింటున్నాం. అయినా స్వాములు కొత్తగా చెబుతున్నట్టు చెప్పాలి. మనం అప్పుడే వింటున్నట్లు వినాలి. ఈ చిలకపలుకులు మాటలు మోసేవారు చెబితే చెప్పుచ్చుక్కొడతాం. ఏంచేత? స్వాముల వారనం గానే వారి వంటి మీద కాషాయి వస్త్రాలుంటాయి. కాళ్ళకి పాంకోళ్ళుంటాయి. చేతిలో కమండలమ్ముంటుంది. మొహమ్మీద విభూతి రేఖలుంటాయి. మనిషి కంటె అతని అలంకారానికి పడిపోతాం గనుక ఇన్ని అలంకారాలతో వెలిగే స్వాములవారు చెప్పింది శాస్త్రమంటాం. అంతేగాని మామూలు చొక్కా, లాగూ తొడుక్కొని సిగరెట్టు కాల్చుకుంటూ అవే నీతులు అక్షరం పొల్లు పోకుండా వల్లిస్తుంటే వళ్ళు మండిపోదూ మరి!

కాషాయ వస్త్రాలెవరు కనిపెట్టేరో గాని, ఇవి బహుసాత్వికమయిన దుస్తులని నేను పరిశోధించి తెలుసుకున్నాను. కాషాయ వస్త్రాలేసుకుని,

కమండలం చేతబట్టి, పాంకోళ్ళు తొడుక్కుని శంభోశంకరా అనగానే ఎక్కడలేని 'సాధుతనం' నరనరాల్లోకి చేరిపోతుంది. చెంప ఛెల్లుమనిపించిన వాడ్ని సైతం వత్సా వరం కోరుకోమని ప్రేమగా అడుగుతాం. నేను మిధ్య, నువ్వు మిధ్య, ఈ బ్రతుకే పెద్ద మాయని చిరునవ్వు చిందిస్తూ సెలవిస్తాం. ఈ లక్షణాలన్నీ వేష మహిమ చేత ఆటోమేటిగ్గా పుట్టుకొచ్చేసాయి. ఫలితంగా కోరిక నశిస్తుంది, వాంఛకి అడ్రసు దొరకదు.

ప్రతి మనిషి కాషాయ వస్త్రాలూ, కమండలాలు, పాంకోళ్ళూ రుద్రాక్షమాలలూ వగైరా హంగుల్తో వుంటే దేశంలో అల్లర్లకీ కిరాతకాలకి చోటే వుండదని నమ్ముతాను. అసలు కోరికే నశిస్తుంది. కనక సమ్మెలూ లాకవుట్లూ కూడా వుండవని విశ్వసిస్తున్నాను. తద్వారా ఏలికలకు తలనొప్పి తగ్గుతుంది. ఎంతో సుఖంగా దేశాన్ని పరిపాలనచేస్తారు. అయితే మాత్రంఎట్టి పరిస్థితులలోనూ ఏలికలు మామూలు దుస్తుల్లోనే వుండాలి. వాళ్ళు కూడా కాషాయ వస్త్రాలకు దిగిపోతే మనతో కలిసి పోతారు. అప్పుడు యిది స్వాముల దేశమవుతుంది. స్వాముల దేశమంటే పొరుగు వారికి అలుసుగా వుంటుంది. గనుక పక్క దేశం వాడెవడో డొక్క చింపివేస్తాడు. అంచేత ఏలికలు ఖరీదైన బట్టల్లోనూ ప్రజలు కాషాయ వస్త్రాలలోనూ వుంటే అటు దేశాధి నేతలకూ ఇటు సర్వ ప్రజలకూ కూడా ఎంతో సుఖంగా వుంటుందని మనసారా మనవి చేసుకుంటున్నాను.